నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల

నిర్మల్ - కొమరం భీం

ఆసిఫాబాద్

గురువారం 05 ఫిబ్రవరి 2026 పేజీలు 05






చెరువులను చిత్తడి నేలగా

# గుర్తించిన వాటిని రక్షించాలి



**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్**

చెరువులను చిత్తడి నేలగా గుర్తించిన వాటిని రక్షించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో చెరువులను చిత్తడి నేలల గుర్తింపుపై జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్ నగర్ డివిజన్ అటవీ అధికారి అప్పయ్య, ట్రైనీ ఐ ఎఫ్ ఎస్ భార్గవ్ కుమార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చిత్తడి నేలల క్రింద చెరువులను గుర్తించి రక్షించాలని తెలిపారు. పెంచికల్ పేట మండలంలోని ఎల్లూరు చెరువును చిత్తడి నేలగా గుర్తించడం జరిగిందని, తద్వారా చెరువులు ఆక్రమణకు గురి కాకుండా కట్టడి చేయడం జరిగిందని తెలిపారు. చెరువును అభివృద్ధి చేసి నీటి సామర్థ్యం పెంచడం ద్వారా రైతులకు సాగు నీరు అందించవచ్చని, పశువులకు త్రాగునీరు అందుబాటులో ఉంటుందని, రకరకాల పక్షులు వలస రావడం ద్వారా పర్యాటక సంఘం అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. తిర్యాణి మండలంలోని చెలిమెల ప్రాజెక్టును చిత్తడి నేలగా గుర్తించి అవసరమైన అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, నీటిపారుదల శాఖ ఈ ఈ లు గుణవంతరావు, ప్రభాకర్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల,సూర్య మేజర్ న్యూస్ :**



ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు చేపట్టిన చర్యలలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల పరిధిలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ

# పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

2వ సాధారణ మున్సిపాలిటీ/మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పి.ఓ., ఎ.పి.ఓ. లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపాలిటీ/మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కేటాయించబడిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ గోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. ఇతరులకు బదులుగా ఓటు వేయడం, ఒకటికి మించి ఓటు వేయడం జరగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ముగిశాక తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలపై శిక్షణలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అధికారులకు కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, లైటింగ్,ఫ్యాన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు మినహాయింపు కోరినట్లయితే ఆమోదించడం జరుగుతుందని, మిగతా వారికి అత్యవసర ఆరోగ్య పరిస్థితులు, ఇతర ఇబ్బందులు తలెత్తితే తప్ప పోలింగ్ విధులలో మినహాయింపు ఉండదని తెలిపారు. 11వ తేదీన పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 12 రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ అన్వేష్, మాస్టర్ ట్రైనర్ హరిప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.,









ఎన్నికల సిబ్బందికి 6 నుండి 8 తేదీ వరకు

# పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

**- ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షి షా**

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు, ఉద్యోగుల సౌకర్యార్థం పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షి షా తెలిపారు. పోలింగ్ రోజున డ్యూటీ కారణంగా ఓటు వేయలేని సిబ్బంది ముందస్తుగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు పనిచేస్తుందని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకొని పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయదలిచిన ఉద్యోగులు తమ వెంట ఎన్నికల డ్యూటీ ఆర్డర్, ఓటరు గుర్తింపు కార్డు ఫారం-12 తీసుకురావాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి సందేహాల నివృత్తి కోసం నోడల్ అధికారి ఎ. ఫణీందర్ రావు ఫోన్: 8106517561 ను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు.




# మున్సిపల్ అభ్యర్థులకు ఎన్నికలపై అవగాహన సదస్సు

**ఆదిలాబాద్ టౌన్, సూర్య మేజర్ న్యూస్**



మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళి, వ్యయ నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు హనుమంత్ నాయక్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులకు బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్), ఎన్నికల వ్యయంపై నిర్వహించిన అవగాహన సదస్సు లో ఆయన పాల్గొనీ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ, అభ్యర్థులు ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలని, ఎన్నికలలలో వ్యయ పరిమితి ఒక లక్ష రూపాయలుగా నిర్ణయించబడిందని, అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను నిర్ణీత ఫారమ్ 1, 2, 3, 4లలో పొందుపరచాలని సూచించారు. అభ్యర్థులు తాము చేసిన ఖర్చుల వివరాలను ఈ నెల 6వ, 9వ తేదీలలో మున్సిపల్ కార్యాలయంలో ఆడిటర్లకు చూపించి, తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలా దేవి, రాజేశ్వర్, వ్యయ పరిశీలకులు విజయ, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, ఇతర ఎన్నికల అధికారులు, అభ్యర్థులు , తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,ఫిబ్రవరి 4, సూర్య మేజర్ న్యూస్ :** విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం, భోజనశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, 100 శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని, సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.అంతకుముందు మండలంలో టి జి ఐ ఐ సి సంబంధిత భూమిని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల తహసిల్దార్ శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ వ్యాధి నివారణకు సమన్వయంతో పని చేయాలి

## - జిల్లా కలెక్టర్ కె. హరిత




**ఆసిఫాబాద్ బ్యూరో,సూర్య మేజర్ న్యూస్ :** జిల్లాలో క్యాన్సర్ వ్యాధి నివారణకు వైద్య, ఆరోగ్య శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సంపూర్ణత అభియాన్ 2.0 లో భాగంగా ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, శిక్షణ ఐ ఎఫ్ ఎస్ అధికారి భార్గవ్ కుమార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్యాన్సర్ వ్యాధి విస్తరించకుండా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. క్యాన్సర్, క్షయ వంటి రోగాలను ప్రాథమిక దశలలో గుర్తించి తగిన చికిత్సలు అందించినట్లయితే తొలి దశలోని నిర్మూలించవచ్చని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. క్యాన్సర్ వ్యాధిలో ఎన్నో రకాలు ఉన్నాయని, వ్యాధుల పట్ల ఎలాంటి భయం ఉండకూడదని, జిల్లాలో 128 కేసులు ఉన్నాయని, వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.అనంతరం కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, శిక్షణ ఐ ఎఫ్ ఎస్ అధికారి భార్గవ్ కుమార్ లతో కలిసి బి. ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాలలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వడోనిలో అటవీశాఖ దాడులు

## - అక్రమంగా చెట్లు నరికివేత - రూ.2.5 లక్షల విలువైన కలప స్వాధీనం

**సిరికొండ ఫిబ్రవరి 4 సూర్య మేజర్ న్యూస్**

ఉట్నూర్ మండలం వడోని గ్రామంలో అటవీశాఖ అధికారులు అక్రమ చెట్ల నరికివేతపై బుధవారం దాడులు నిర్వహించారు. డీఎఫ్ఓ ఆదిలాబాద్, ఎఫ్‌డీఓ



ఉట్నూర్, ఎఫ్‌డీపిటి ఆదేశాల మేరకు సిరిచెల్మ టైగర్ జోన్ రేంజ్ అధికారి నాగవత్ స్వామి సిబ్బందితో కలిసి గ్రామంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వడోని గ్రామానికి చెందిన పోలీసు కానిస్టేబుల్ దయానంద్ ఇంట్లో, అలాగే ఆయన కౌలుకు పనిచేస్తున్న సర్వే నంబర్లు 85, 83 ప్రాంతాల్లో ఆరు చెట్లను అక్రమంగా నరికి విక్రయానికి సిద్ధం చేసినట్లు అధికారులు గుర్తించారు. నిర్మల సమీపంలోని మొండిగుట్ట చెక్‌పోస్ట్ వద్ద కలపతో నిండి ఉన్న ఒక ఐచర్ వాహనాన్ని అటవీ సిబ్బంది అడ్డుకొన్నారు. విచారణలో ఆ కలప వడోని గ్రామం నుంచే నరికి తరలించినదని తేలింది. అనంతరం గ్రామంలో మరిన్ని తనిఖీలు జరిపిన అధికారులు మరింతగా రెండు చెట్లు, అలాగే ఫర్నీచర్ రూపంలో రూ. 2.50 లక్షల విలువైన అక్రమ కలపను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చంద్రారెడ్డి, బీట్ ఆఫీసర్లు సత్తయ్య, సంతోష్, సిబ్బంది భీంజి నాయక్, జుగాందిరావ్, మారుతి, జంగు నిరంజన్ పాల్గొన్నారు.

### ఆసాంఘిక కార్యకలాపాలు చేసిన వారిపై

# చట్టరీత్యా చర్యలు తప్పవు

**బేల, ఫిబ్రవరి 4, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రజల రక్షణ, సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ అండ్ సెర్చ్) లను నిర్వహించడం జరుగుతుందని జైనథ్ సిఐ జి.




శ్రావణ్ అన్నారు. బుధవారం బేల మండలం సైద్ పూర్ గ్రామంలో 50 మంది సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వహించడం,గుడుంబా పై స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ డ్రైవ్ లో 30 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు 12 మందిపై బేల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుడుంబా, గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండాలని సూచించారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సోషల్ మీడియా పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని అన్నారు. సి సి ఎస్ సి ఐ చంద్రశేఖర్, బేల ఎస్సై ఎల్ ప్రవీణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం అందాలి -కలెక్టర్ హరిత

**వాంకిడి, ఫిబ్రవరి 4,సూర్య మేజర్ న్యూస్**

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం వాంకిడి మండలంలో పర్యటించిన ఆమె పాఠశాలలు, ఉపాధిహామీ పనులు, అంగన్వాడీ కేంద్రం, రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. స్నానపు గదులు, టాయిలెట్లు సరిపడ లేవని విద్యార్థులు తెలిపడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచనలు చేశారు. వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి తెలిపారు.అనంతరం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవాల్సిన విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.తర్వాత రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిస్టర్, స్టోర్ రూమ్ పరిశీలించారు. లబ్ధిదారులతో మర్యాదగా ప్రవర్తించి సకాలంలో సరఫరా చేయాలని సూచించారు.సోనాపూర్ జీపీ పరిధిలోని గణేష్‌పూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించిన కలెక్టర్ కూలీలకు పని ప్రదేశంలో నీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు తెలిపారు. అనంతరం చౌపనూడ గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాలను సందర్శించి టాయిలెట్ల నిర్వహణ, విద్యార్థుల హాజరు శాతం తదితర అంశాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ అధికారి భరత్ కుమార్, డీఆర్డీవో దత్తారావు, ఎంపిడీవో పాటిల్ జ్యోత్స్న, ఏపీవో శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ కలప పట్టివేత కేసు నమోదు

**గుడిహత్నూర్ ఫిబ్రవరి 04 మేజర్ సూర్య న్యూస్:**

మండలంలోని ముత్నూర్ గ్రామంలో 15 టేకు దుంగలను ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిని పట్టుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు డిఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు ముత్నూర్ గ్రామానికి చెందిన గాటాడే దశరథ్ ఇంట్లో అటవి అధికారులు తనిఖీలు నిర్వహించగా అతని ఇంట్లో 15 టేకు దుంగలు స్వాధీనం చేసుకున్ని అతని పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కలప దుంగలను స్వాధీనం చేసుకుని జీటీడి ఇచ్చోడకు తరలించామన్నారు.కలప విలువ సుమారుగా 20వేల రూపాయలు ఉంటుందన్నారు.ఈ సందర్భంగా డిఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అక్రమంగా కలప నిలువ ఉంచిన అక్రమంగా చెట్లు నరికిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ పుండలీక్, ఇమ్రాన్, ప్రశాంత్ విశ్వజిత్ తదితరులు ఉన్నారు.



# మహాత్మా గాంధీ పేరు మార్చడం సరికాదు

**కడం,ఫిబ్రవరి04,సూర్య మేజర్ న్యూస్**

కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం పేరును మార్చుడాన్ని వ్యతిరేకిస్తూ కడెం మండలంలోని చిట్యాల,ధర్మాజీపేట,కొత్త ధర్మాజీపేట,చిన్న బెల్లాల్,పెద్ద బెల్లాల్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపాధి కూలీల దగ్గరకు వెళ్లి సంతకాల సేకరణ చేపట్టారు.అనంతరం ఉన్నతాధికారులకు ఆ పత్రాలను పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మెన్ పడిగెల భూషణ్,మండల అధ్యక్షులు మల్లేష్ యాదవ్,నాయకులు సతీష్ రెడ్డి,సర్పంచులు ఫోరం మండల అధ్యక్షులు జొన్నల చెంద్రశేఖర్, ఆకుల లచ్చన్న,బొడ్డు గంగన్న ఉన్నారు.



# బ్యాలెట్ పేపర్ల ముద్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలి

## - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,ఫిబ్రవరి 4,సూర్య మేజర్ న్యూస్**



2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా బ్యాలెట్ పేపర్ల ముద్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా



కేంద్రంలో బ్యాలెట్ పేపర్ల ముద్రణ కొరకు ఎంపిక చేసిన శారద ప్రింటింగ్ ప్రెస్ ను కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించి ముద్రణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ ముగిసిందని, నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అర్హత గల అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఎన్నికల గుర్తులు కేటాయించడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో 240 మంది, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో 173 మంది, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో 107 మంది, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులలో 113 మంది, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులలో 60 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని తెలిపారు. జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో మొత్తం 693 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించడం జరిగిందని,ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యం బ్యాలెట్ పేపర్ల ముద్రణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ కళ కుష్టి వ్యాధి నివారణ

**దస్తురాబాద్,ఫిబ్రవరి 04 ,సూర్య మేజర్ న్యూస్ :**

పల్లెల్లో కుష్టి వ్యాధి నివారణకై అవగహన కార్యక్రమంలో భాగంగా బుధవారం రేవోజిపేట్ గ్రామ పంచాయతీ ఆవరణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పల్లె దావఖానా ఇంచార్జి పల్లవి గ్రామంలోని ప్రజలతో కుష్టి వ్యాధి



సోకినా వారి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వ్యాధి నివారణకు పాటించాల్సిన నియమాలను వ్యాధి సోకినా వారిని ఏవిందంగా గుర్తించే విధానాలు గురించి ప్రతీజ్ఞ లో భాగంగా కుటుంబములో లేదా పొరుగు వారిలో లేదా ఈ సమాజంలో ఎవరికైనా చర్మంపై స్పర్శ కోల్పోయిన మచ్చలు ఉండి వాటిని తాకినప్పుడు లేదా దానిమీద నొప్పి కలిగించి నప్పుడు తెలియకపోతే వారిని సమీప ఆసుపత్రికి వెళ్ళి డాక్టర్ను సంప్రదించి వ్యాధి నిర్ధారణ చేసుకోని తగిన చికిత్స తీసుకోమని సలహా ఇస్తాను. కుష్టువ్యాధి గ్రస్తులను మరియు కుష్టు వ్యాధి కారణంగా అంగవైకల్యం ఏర్పడిన వారిపట్ల శ్రద్ధ వహిస్తాను, వారిని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి చికిత్స తీసుకొనేలా నేను భాధ్యత వహిస్తానని .కుష్టు వ్యాధి గ్రస్తులను నా స్వంత కుటుంబ సభ్యులుగా భావించి ఎటువంటి వివక్షత చూపకుండా ప్రేమతో వారి ఆత్మ గౌరవాన్ని పరిరక్షించేలా పాటుపడుతాను, కుష్టువ్యాధి ఒక బ్యాక్టీరియా ద్వారా వచ్చే వ్యాధి అని, ఎండీటీ చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని,సత్వర చికిత్స ద్వారా కుష్టువ్యాధి మూలంగా వచ్చే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చనే సందేశాన్ని సమాజంలో వ్యాప్తి చేస్తానని మహాత్మా గాంధీ కలలు కన్న విధంగా సమీప భవిష్యత్తులో కుష్టువ్యాధి రహిత భారతదేశ నిర్మాణములో అందరితో కలిసి కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేపించారు ఈ కార్యక్రమలో గ్రామ సర్పంచ్ కోలా మహేష్, వార్డు సభ్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా ప్రొఫెషనల్ ఫోటో & వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా కనుకయ్య గౌడ్

**మందమర్రి, ఫిబ్రవరి 3, సూర్య మేజర్ న్యూస్**

మంచిర్యాల జిల్లా ప్రొఫెషనల్ ఫోటో & వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా మందమర్రి పట్టణానికి చెందిన వడ్లకొండ కనుకయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని తోల్లవాగు సమీపంలోని ఎస్ కన్వెన్షన్ హాల్ లో బుధవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా ప్రొఫెషనల్ ఫోటో & వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా వడ్లకొండ కనుకయ్య గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకొని జిల్లా అధ్యక్షులు అప్పాసు రామన్న, ప్రధాన కార్యదర్శి పోతరవేణి శ్వాస తిరుపతి, కోశాధికారి ముక్కెర శ్రీనివాస్‌లు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కనుకయ్య గౌడ్ మాట్లాడుతూ తనను ఎన్నుకున్న సభ్యులకు పేరుపేరున కృతజ్ఞతలు చెప్పారు. తనపై నమ్మకంతో అసోసియేషన్ జిల్లా కార్యవర్గం జిల్లా వ్యవస్థాపక అధ్యక్ష పదవికి ఎంపిక చేశారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో అసోసియేషన్ బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుండి ఫోటో వీడియో గ్రాఫర్లకు సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. అందరం ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించుకోగలమని, వేగంగా మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు క్రియేటివిటీ స్కిల్స్‌ను పెంచుకొని వృత్తిలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కనకయ్య గౌడ్ ను జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఎంపిక చేయడం పట్ల మందమర్రి పట్టణ ఫోటో ఒ వీడియో గ్రాఫర్లు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు పసుల వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శి ఆడెపు అశోక్ కుమార్, కోశాధికారి బద్రి సతీష్, మణిరాజ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతోనే టీబీ రహిత సమాజం సాధ్యం

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 04, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రజలందరి సహకారంతో త్వరలోనే టీబీ రహిత భారతదేశం దిశగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని బుధవారం చందారం గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో వెంకట్రావుపేట వైద్యాధికారి డాక్టర్ సతీష్



కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షెట్టిపేట మండలం లోని కొత్తూర్ గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా రెండవ విడత కార్యక్రమంలో అనుమానితులందరికీ పోర్టబుల్ మొబైల్ ఎక్స్ రే ద్వారా ఎక్స్ రే పరీక్షలు నిర్వహించి టీబీ నిర్ధారణ చేసినట్లు తెలిపారు. గత మూడు రోజుల నుండి కొత్తూర్, దొడెపల్లి, తిమ్మాపూర్ గ్రామాలలో క్యాంపులు నిర్వహించి 265 మందికి ఎక్స్ రే పరీక్షలు 80 మందికి తెమడ పరీక్షలు, 200 మందికి షుగర్, బీపి తోపాటు సాధారణ పరీక్షలు నిర్వహించి మందులను అందజేసినట్లు డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. అనంతరం ప్రజలకు క్షయ వ్యాధి పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,సూపర్ వైజర్లు శోభ,టీబీ సూపర్ వైజర్ సురేష్ ,ఎంఎల్ హెచ్ పి లు సుమలత, అక్షయ , హెల్త్ అసిస్టెంట్లు గఫూర్, ఇసాక్ అహ్మద్, ఏఎన్ఎం యేసువర,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## సమస్యల సాధనకై ఢిల్లీలో పోరాటానికి పయనమైన ఉపాధ్యాయులు

**కాగజ్నగర్,ఫిబ్రవరి 4, సూర్య మేజర్ న్యూస్ :**

దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న చలో ఢిల్లీ -- మార్చ్ టు పార్లమెంట్. కార్యక్రమంలో భాగంగా కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకత్వం ఢిల్లీకి చేరుకుని ఉద్యమంలో చురుకుగా పాల్గొంటోంది. ఉపాధ్యాయుల హక్కులు, వృత్తి గౌరవం మరియు ప్రభుత్వ విద్య వ్యవస్థను కాపాడాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకత్వం సంపూర్ణ సంఘీభావాన్ని




ప్రకటించింది. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు,సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు, ఎస్ జి టి లకు ఎమ్మెల్సీ ఓటు హక్కు, నెప్ --2020 రద్దు, పాఠశాలల విలీనాన్ని నిలిపివేయాలనే ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను అంగీకరించాలని కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకత్వం ఈ సందర్భంగా డిమాండ్ చేసింది.

## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ఆధ్వర్యంలో చదువుకో తెలంగాణ గోడప్రతుల విడుదల

**తిర్యాణి సూర్య మేజర్ న్యూస్**

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో 10 వ తరగతి చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారిని చదువుపై మరింత శ్రద్ధ పెట్టేలా ప్రోత్సహించి,వారి లక్ష్యాలను సాధించే దిశగా మార్గనిర్దేశం చేసేందుకు సహకరించే గొప్ప కార్యక్రమశీ అయిన చదువుకో తెలంగాణపోస్టర్‌ను తిర్యాణి మండలకేంద్రంలో ని జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ మండల్ యాత్ ప్రెసిడెంట్ పున్నం హరీష్ కుమార్ ,బుద్దే విజయ్ మరియు బాపురావ్,సర్పంచ్ ఏదుల సుమలత,ఉపసర్పంచ్‌లు కోదురుపాక పవన్,చేని కుమార్ ఉపాధ్యాయులు అమరేందర్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మంచిర్యాల బ్రాంచ్ మేనేజర్ నూనె ప్రశాంత్,డెవలప్మెంట్ ఆఫీసర్ బొద్దున లలిత రమేష్, ఎగ్జిక్యూటివ్స్ కొలిపాక రానదీప్ పాల్గొనడం జరిగింది.




## ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి

### మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ : రమేష్

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 04 సూర్య మేజర్ న్యూస్**

క్యాతనాపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికలను శాంతియుత వాతావరణం లో నిర్వహించడానికి సహకరించాలని మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ బుధవారం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ పార్టీలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎలాంటి గొడవలు అల్లర్లు జరపకూడదు అని అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## విజ్ఞాన యాత్రలో పెంచికల్ పేట్ పీఎం శ్రీ పాఠశాల విద్యార్థులు

**పెంచికల్ పేట్,ఫిబ్రవరి 4, సూర్య మేజర్ న్యూస్:**

పెంచికల్ పేట్ పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులు విజ్ఞాన యాత్ర కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ డైరీ పాల కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ పాల ప్యూరిఫికేషన్ ప్రక్రియ, పాల ఉత్పత్తుల తయారీ,మిషన్ పని విధానాల గురించి సిబ్బంది విద్యార్థులకు వివరించారు. తర్వాత, కరీంనగర్ జింకల పార్క్‌ను సందర్శించిన విద్యార్థులు వివిధ జంతువులను పరిశీలించారు. పార్కు పరిసరాల పరిరక్షణ మరియు జంతు సంరక్షణ పద్ధతుల గురించి కూడా నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి వాలీబాల్ ఆర్చరీ పోటీలను ప్రారంభించిన ఎస్పీ అఖిల్ మహాజన్





**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వనవాసి కళ్యాణ పరిషత్ ద్వారా నిర్వహించబడుతున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ మరియు ఆర్చరీ పోటీలలోని ఫైనల్ క్రీడలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. ఓడినవారు వచ్చే సంవత్సరం మరింత కష్టపడి గెలవడానికి కృషి చేయాలని తెలిపారు. ఆరు జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మీరు మీ సమాజానికి ఆదర్శప్రాయంగా నిలుస్తూ భవిష్యత్తు లో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ప్రపంచం పరిగెడుతున్న వేగంతో అభివృద్ధిని సాధించే దిశగా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సూచించారు. ఉన్నత చదువులను అభ్యసించాలని, ఉన్నత లక్షలను ఛేదించేదిశగా కృషి చేయాలని తెలిపారు. వాలీబాల్ మరియు అర్చరీ నందు చివరి పోటీలను జిల్లా ఎస్పీ స్వయంగా ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచి ప్రారంభించారు.

## పోచంపల్లిలో అగ్ని ప్రమాదం .. ఇల్లు పాక్షికంగా దగ్ధం

**సిరికొండ ఫిబ్రవరి 4 సూర్య మేజర్ న్యూస్**



పోచంపల్లి గ్రామానికి చెందిన మడావి అన్నపూర్ణ సోనేరావ్ కుటుంబంపై వరసగా దురదృష్టాలు పెనవేసుకుంటున్నాయి. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కుటుంబం రెండు సంవత్సరాల క్రితం తండ్రి, కొడుకు నీటిలో మునిగి మృత్యువాత పడ్డ ఘటనతో కుటుంబం కోలుకోకముందే, ఇప్పుడు మరొక దుర్ఘటన ఆ కుటుంబాన్ని కుదిపేసింది. బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మడావి అన్నపూర్ణ సోనేరావ్ ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఆకాష్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గృహోపకరణాలు, దుస్తులు, ముఖ్యమైన పత్రాలు భారీగా నష్టపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తాజాగా ఇల్లు కాలిపోవడం కుటుంబాన్ని తీవ్ర మనస్తాపానికి గురిచేస్తోందని గ్రామస్తులు తెలిపారు. అగ్ని ప్రమాదంపై వెంటనే సిరికొండ తహశీల్దార్‌కు దరఖాస్తు సమర్పించినట్లు అన్నపూర్ణ కుటుంబ సభ్యులు వివరించారు. జరిగిన నష్టాన్ని పరిశీలించి అధికారులు తక్షణం ఆర్థిక సహాయం మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.



## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి... ఏఈఓ లు

**పెంచికల్ పేట్,ఫిబ్రవరి4, సూర్య మేజర్ న్యూస్:**

భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఈఓలు గౌసియా, వంశీ అన్నారు.మండలంలోని దరోగ పల్లి, అగర్ గూడ గ్రామాలలో బుధవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం కిసాన్ సహాయం పొందాలంటే తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పథకాలను పొందాలన్నా పంటలను కొనుగోలు అమ్మకాలు చేపట్టాలన్న ఈ రిజిస్ట్రేషన్ నెంబర్ అవసరమని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలతోపాటు చెడ్వాయి, అగర్ గూడ క్లస్టర్ రైతులు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వివరాల కోసం రైతు వేదికలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు బొట్టు పల్లి హరీష్,అల్లూరి రాజు మరియు రైతులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల కోసం పట్టణంలో ఫ్లాగ్ మార్చ్

### - నిర్భయంగా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

### - సాయుధ సిబ్బంది, పోలీసు అధికారులతో పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ - డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రధాన కూడల గుండా ఫ్లాగ్ మార్చి నిర్వహించడం జరిగింది. ప్రజలకు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచిస్తూ ఎలాంటి అత్యవసర సమయంలోనైనా పోలీసు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. ఎలాంటి సమాచారం ఉన్న డయల్ 100 ద్వారా తెలియజేయాలని తెలిపారు. అక్రమ మద్యం, నగదు, బహుమతులు లాంటి సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, ప్రేమ్ కుమార్,ఎస్ఐలు నాగనాథ్,అశోక్,రిజర్వ్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## డిఎస్పీ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి పై కేసు నమోదు

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్:** ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు డిఎస్పీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని విద్యానగర్ కు చెందిన కొమ్మవార్ ప్రవీణ్ కుమార్ 2012 సంవత్సరంలో విడుదలైన గ్రూప్ 1 నోటిఫికేషన్ లో మార్శెట్టి రాజమణి భర్త (లేట్ )తిరుపతి ల కొడుకు అయినా మార్శెట్టి సాయి ప్రసాద్ కి గ్రూప్ 1 లో డి ఎస్పీ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. నమ్మిన సదరు అభ్యర్థి 22 లక్షలు చెల్లించుకున్నారు. తీరా మోసపోయినట్లు గ్రహించి అతని పై ఫిర్యాదు చేయగా 1 టౌన్ లో కేసు నమోదు అయిందని తెలిపారు. అలాగే ఇంకా ఎవరైనా అతనికి జాబ్ కోసం డబ్బులు ఇచ్చిన వాళ్లు ఉంటే నిర్భయంగా వచ్చి పిర్యాదు చేయవచ్చని సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించిన ఎంపీడీఓ

**పెంచికల్ పేట్, జనవరి 23, సూర్య మేజర్ న్యూస్:**

మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆల్బర్ట్ బుధవారం ఎల్లూర్ గ్రామ పంచాయితీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు.ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరగా ప్రారంభించాలని, పనులు ప్రారంభించినవారు ఇళ్ల కట్టడాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆల్బర్ట్ ఆదేశించారు. ఈ ఇళ్ల ద్వారా పేదలకు ఆసరా అవుతుందని, నిర్మాణ పనులు రాయితీలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్లూర్ సర్పంచ్ చప్పిడి రవీందర్,పంచాయితీ కార్యదర్శి చంద్రయ్య మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## నేడు కోసుపటేల్‌గూడలో

### నగేరా పెందుర్ వంశీయుల పెద్దదేవుడు సమావేశం

**సిరికొండ, ఫిబ్రవరి 4, సూర్య మేజర్ న్యూస్**

నేడు సిరికొండ మండలంలోని కోసుపటేల్‌గూడలో నగేరా పెందుర్ వంశీయుల ఆధ్వర్యంలో పెద్దదేవుడు సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు నిర్వాకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండే కాకుండా మహారాష్ట్రకు చెందిన వివిధ మండలాలు, గ్రామాల నుంచి నగేరా--పేందుర్ వంశీయులు భారీ సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు.సమావేశానికి వంశీయులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పెందుర్ ఆనంద్‌రావ్, కటోడాల్ పెందుర్ జంగు, పెందుర్ బండు, పెందుర్ బీంరావ్, కుట్మల్, పెందుర్ చంద్రా, ప్రధానులు కలిసి నిర్వహించారు.

## రాయిగూడలో ఆధార్ ఇంటిగ్రేటెడ్ క్యాంప్

**సిరికొండ, ఫిబ్రవరి 4 సూర్య మేజర్ న్యూస్**

రాయిగూడ ప్రభుత్వ అశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆధార్ ఇంటిగ్రేటెడ్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ పెందుర్ లక్ష్మణ్‌రావు హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఆధార్ నమోదు, సవరణలు వంటి సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు సంబంధిత సిబ్బంది కృషి చేశారు. ఈ క్యాంపులో ప్రధానోపాధ్యాయులు అత్రం భాస్కర్, పంచాయతీ కార్యదర్శి నిత, వి.విజయ్ ప్రకాష్, గజానంద్ నాయక్, శంభు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## రాంపూర్ చెక్‌పోస్ట్ వద్ద రూ. 28 లక్షలు స్వాధీనం

**ఆదిలాబాద్: ఫిబ్రవరి 4, మేజర్ సూర్య న్యూస్:**

ఎన్నికల నగారా మోగడంతో జిల్లాలో తనిఖీలు ముమ్మరమయ్యాయి. రాంపూర్ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం పోలీసులు చేపట్టిన సోదాల్లో మహారాష్ట్ర బస్సులో తరలిస్తున్న రూ. 28 లక్షల నగదును అధికారులు సీజ్ చేశారు. పత్రాలు చూపకపోవడంతో సుభాష్ కేశవ్ అనే వ్యక్తి నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలు ప్రయాణాల్లో పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది మరియు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# ఎన్నికల కోడ్ ఉల్లంఘన

### సి ఆర్ పి విధుల నుండి తొలగింపు

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు భీంపూర్ మండలం పిప్పల్‌కోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జిల్లా పరిషత్ హై స్కూల్))లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గా పనిచేస్తున్న పి. రవీందర్‌ను విధుల నుండి తొలగిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ రాజేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు.మండల విద్యాశాఖాధికారి సమర్పించిన నివేదిక ప్రకారం, సదరు ఉద్యోగి ఒక రాజకీయ పార్టీలో చేరడమే కాకుండా ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నట్లు నిర్ధారణ అయిందని, ఈ విషయంపై దినపత్రికల్లో వచ్చిన వార్తలు, విచారణలో బయటపడ్డ ఆధారాలను పరిగణనలోకి తీసుకుని ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమగ్ర శిక్షాణ తెలంగాణ ఉపాధి ఒప్పంద నిబంధనల ప్రకారం సిబ్బంది రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. క్రమశిక్షణా ఉల్లంఘనకు సంబంధించి ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే సదరు ఉద్యోగిని తక్షణమే విధుల నుండి తొలగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పేర్కొన్నారు.

# ఈవిఎం గోదాము వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు

## - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్,ఫిబ్రవరి 4, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం లు భద్రపరిచిన గోదామును నెలవారి తనిఖీలలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, శిక్షణ ఐ.ఎఫ్.ఎస్. అధికారి భార్గవ్ కుమార్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన బందోబస్తు చర్యలు పకడ్బందీగా చేపట్టడం జరిగిందని, సి సి కెమెరాలు ద్వారా 24 గంటలు పర్యవేక్షించడం జరుగుతుందని, సి సి కెమెరాలు ఎల్లవేళలా పనిచేసే విధంగా అధికారులు



చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసిన కలెక్టర్లు

**కాగజ్నగర్, ఫిబ్రవరి 4, సూర్య మేజర్ న్యూస్ :**

కాగజ్‌నగర్‌లో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్ల పరిశీలన కాగజ్‌నగర్ పట్టణంలోని డి.ఏ.వి పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్,కౌంటింగ్




హాళ్లను కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి (లోకల్ బాడీస్) ,సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయాలు,పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి డిప్యూటీ ఈఈ రమాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. శంకర్ పాల్గొన్నారు.

## నిందితులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలి :ఐద్వా

**కాగజ్నగర్, ఫిబ్రవరి 4, సూర్య మేజర్ న్యూస్ :**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆలిండియా డెమొక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ (ఐద్వా) మహిళా సంఘం బుధవారం మాచర్ల వినోద అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి సమావేశంలో జనవరి 23 తారీకు రోజు ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పై గంజాయి ముఠా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించడం జరిగింది. మరియు ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలం లోని రాళ్ల గూడెం లో జరిగిన హత్య గురించి కూడా నేరస్తుడ్ని కఠినంగా శిక్షించాలని కోరడం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు మాచర్ల వినోద, షాహిన్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య త్యాగం మరువలేనిది

## - పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు ఇరుకుల్ల ఆంజనేయులు

**ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ,సూర్య మేజర్ న్యూస్**

ఎక్సైజ్ కానిస్టేబుల్ పద్మశాలి ముద్దుబిడ్డ సౌమ్య త్యాగం మరువలేనిదని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు ఇరుకుల్ల ఆంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలో పద్మశాలి సంఘం నాయకులతో కలిసి ఆమెకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో ఎక్సైజ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న సౌమ్య వెహికల్ చెకింగ్ చేస్తున్న క్రమంలో గంజాయి తరలిస్తున్న కారుని అడ్డుకోవడంతో కార్ లో ఉన్నటువంటి దుండగులు కార్ తో గుద్ది సౌమ్యని తీవ్రంగా గాయపరిచారని హైదరాబాదులోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సౌమ్య ప్రాణాలు వదిలిందని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా డ్రగ్స్ గంజాయి నిషేధిత మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సౌమ్య కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని సౌమ్య ని ప్రభుత్వాన్ని ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో పద్మశాలి సంగం రాష్ట్ర నాయకులు గుండు శంకర్, ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షులు అనుమాండ్ల శ్రీకాంత్, యువజన సంగం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్, పద్మశాలి సంగం నాయకులు చెన్నూరీ ప్రకాష్,చిప్ప చిట్టిబాబు, పసుపునూరి తిరుపతి, తేలివార్ మోహన్, గుజ్జ మోహన్, పొన్న తిరుపతి,ఇరుకుల్ల అంజయ్య, ఇరుకుల్ల ప్రభాకర్, ఇరుకుల్ల నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



### నాణ్యతకు అధిక ప్రాధాన్యతనిస్తూ

## ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

### - ఇకపై రోజుకు 2.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.4 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరపాలి - 15.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యంగా పనిచేయాలి 6 ఏరియా జీఎంలకు సీఎండీ డి కృష్ణ భాస్కర్ సూచన

**మందమర్రి, ఫిబ్రవరి 4, సూర్య మేజర్ న్యూస్.**

నిర్దేశిత లక్ష్యాల సాధనతో పాటు ముఖ్యంగా నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నాణ్యత గల బొగ్గును మాత్రమే వినియోగదారులు కోరుతున్నారని, ఈ దిశగా అన్ని రకాల చర్యలు తీసుకోవాల్సిందిగా సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ డి కృష్ణ భాస్కర్ అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లను సూచించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి ఆయన బొగ్గు ఉత్పత్తి, రవాణా, నాణ్యత తదితర అంశాలపై సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు బొగ్గు మార్కెట్లో వినియోగదారులు తమకు అవసరమైన నాణ్యత గల బొగ్గును మాత్రమే స్వీకరిస్తున్నారని, కనుక బొగ్గు పరిమాణం కన్నా బొగ్గు నాణ్యతా ప్రమాణాల పెంపుదలకు గట్టి చర్యలు తీసుకోవాలని ప్రతీ అధికారి, ఉద్యోగి ఈ దిశగా శ్రమిస్తేనే సంస్థకు భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఏడాది పలు కారణాల వల్ల నెలవారీ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కొంత వెనుకబడి ఉన్నామని, అయినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం చివరి వరకు ప్రతీ రోజూ కనీసం 2.20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.40 లక్షల టన్నుల బొగ్గు రవాణా, 15.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యంగా పనిచేయాలన్నారు, ఈ కార్యక్రమంలో వివిధ ఏరియాల జనరల్ మేనేజర్లు తమ ఏరియాల్లో సాగుతున్న ఉత్పత్తి ప్రక్రియను వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్ వి సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) గౌతమ్ పొట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి వెంకన్న, జీఎం (కో ఆర్డినేషన్ & మార్కెటింగ్) టి శ్రీనివాస్, కార్పోరేట్ జీఎంలు, అన్ని ఏరియాల జీఎంలు, అధికారులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాల ఎదుట ఆర్టీసీ బస్సుల నిలుపుదల కోరుతూ పిడిఎస్యు వినతి

**జైపూర్, ఫిబ్రవరి 4: సూర్య మేజర్ న్యూస్**

జైపూర్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ఆర్టీసీ బస్సులను ఆపాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్యు విద్యార్థి సంఘం నాయకులు ఆర్టీసీ అధికారులను ఆశ్రయించారు. బుధవారం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కలిసి మంచిర్యాల జిల్లా ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ శ్రీలతకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కళాశాలలో 160 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా, అందులో 50 మంది మహిళా విద్యార్థులు ఉన్నారని తెలిపారు. కళాశాల సమీపంలో బస్సులు నిలుపకపోవడం వల్ల విద్యార్థులు రహదారి దాటుతూ ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందని, ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కళాశాల పని వేళల్లో బస్సులు కళాశాల ఎదుటనే నిలిపేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి శాశ్వత పరిష్కారం అందించాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఏడిఎం శ్రీలత బస్సుల నిలుపుదల విషయంలో డ్రైవర్లకు, సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.



## ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

**ఆసిఫాబాద్,ఫిబ్రవరి04,సూర్య మేజర్ న్యూస్ :**

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను సందర్శించి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన



కళాశాలలోని తరగతి గదులు, హాస్టల్ వసతులు, మెస్ ,ఇతర సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. తరగతులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని రిజిస్టర్లను తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మెస్‌లో వండుతున్న ఆహారాన్ని పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. కళాశాల , హాస్టల్ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇటీవల నర్సింగ్ కళాశాల నిర్వహణలో కొన్ని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీ ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడమే జిల్లా యంత్రాంగం ప్రధాన ఉద్దేశమని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు, సంబంధిత విభాగాల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలి

**ఉట్నూర్,సూర్య మేజర్ న్యూస్:** సీనియర్ ఉపాధ్యాయులను ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ నుండి మినహాయించాలని, ప్రభుత్వ విద్యకు నష్టం కలిగించే జాతీయ విద్యా విధానం ఎన్ఈపి ని రద్దు చేయాలని, పాఠశాలల మూసివేత, విలీనాలను ఆపాలని, ఎన్పిఎస్, సిపిఎస్ లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రాథమిక ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని తదితర డిమాండ్లతో అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ ఎఐ జాక్టో పిలుపు మేరకు ఫిబ్రవరి 5న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే చలో పార్లమెంట్ కార్యక్రమానికి,బుధవారం రోజున ఉదయం జిల్లా కేంద్రం నుంచి జిల్లా అధ్యక్షులు మూగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జాదవ్ రవికుమార్ లో ఆధ్వర్యంలో ఎస్టియు జిల్లా నాయకులు ఢిల్లీకి బయలు దేరారు . ఈ సందర్భంగా ఎస్టీ యు జిల్లా అధ్యక్షులు మూగ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు వచ్చి నాలుగు నెలలు గడిచినా కేంద్ర ప్రభుత్వం గానీ, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి ఎన్సీటిఈ గానీ ఏమాత్రం స్పందించకుండా మౌనంగా ఉండడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. 23 ఆగస్టు 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష మినహాయింపు ఇచ్చినట్లు నోటిఫికేషన్ లో పేర్కొన్న ఎన్సీటిఈ సుప్రీంకోర్టుకు ఆ విషయాన్ని తెలియజేయడంలో విఫలమైందని ఆరోపించారుసుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెండేళ్లలో టెట్ పాస్ కాకపోతే లక్షలాది ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని, వేలాది పాఠశాలలు మూతపడి, పేద పిల్లలకు విద్య దూరమయ్యే ప్రమాదం దాపురించిందని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యా వ్యవస్థలో సంక్షోభానికి కారణమైన సుప్రీంకోర్టు తీర్పుకు కేంద్ర ప్రభుత్వం, ఎన్సీటిఈ లే బాధ్యత వహించాలని అన్నారు. తక్షణమే కేంద్రం సుప్రీం కోర్టులో రివ్యూ లేదా క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేయాలని, లేదా సీనియర్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించే విధంగా విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ రవికుమార్ మాట్లాడుతూ చలో పార్లమెంట్ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు పెద్దమొత్తంలో హాజరవుతున్నారని తెలిపారు అనివార్య కారణాల వల్ల ఢిల్లీ కార్యక్రమానికి హాజరు కాని ఉపాధ్యాయులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలపాలని ఆయన కోరారు, ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మూగ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ రవికుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జాదవ్ అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బెజ్జంకి రవీంద్ర, పుప్పాల నరేందర్ లతో పాటు వివిధ మండలాల అద్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

